## మన ఆచారములు - అంతరార్థములు

# దేవుని పూజించడం ఎందుకు?

**- నిత్యానంద్.**

దేవుని పూజించడమనేది ఒక ప్రాంతానికి, ఒక భాషకు, ఒక మతానికి సంబంధించినది కాదు. అందరూ వారి వారి ఆలయములలో దైవ ప్రార్థన చేస్తారు. వాటినే మనము మసీదు, చర్చి, గుడి వంటి పేర్లతో పిలుస్తున్నాము. అసలు ఈ పూజలు, ధ్యానము, జపము మనకు ఎలా ఉపయోగపడతాయి? మనిషి ఎంత గొప్పవాడైనా అరిషడ్వర్గానికి అధీనుడైతే పతనము తప్పదు. ఈ విషయము మనము విశ్వామిత్రుని జీవిత చరిత్ర నుండి తెలుసుకోవచ్చు. తన తపశ్శక్తిని క్రోధముతో ఒకసారి, అసూయతో మరొకసారి ఇలా వృధా చేసుకున్నాడన్నది తెలిసిన విషయమే! అరిషడ్వర్గాన్ని జయించినవారికి నిత్యమూ ఆనందమయమే!

ఈ మానవశరీరము తనకు పనికిరాని వ్యర్థపదార్థాన్ని విసర్జించే శక్తిని కలిగి ఉన్నది. అది సృష్టికర్త సృజనశక్తికి నిదర్శనము. ఇక మానసిక, భావప్రకటన విషయములలో మనము మంచి-చెడుల విచక్షణ కోల్పోతూ ఉంటాము. ఉదాహరణకు కోపము వచ్చినపుడు మనపై మనకు నియంత్రణ ఉండదు. ఉద్రేకములో ఎదుటివారిని దూషిస్తాము. తరువాత మనము చేసిన పనికి పశ్చాత్తాపముతో కృంగిపోతుంటాము. ఈ మానసిక మరియు భావప్రకటనల విషయములో మంచి-చెడులను గుర్తించగలిగే శక్తి ధ్యానము వలన, స్వచ్ఛమైన మనసుతో భగవంతుని ప్రార్థించడము వలన లభిస్తుంది.

ధ్యానము వలన ఆలోచనలకు మనము బానిసలము కాకుండా, ఆలోచనలకు మనకు బానిసగా చేసుకునే శక్తి కలుగుతుంది. చాలా సందర్భములలో మనకు వచ్చే ఆలోచనలు ఎంతో శక్తివంతముగా, విజయమును చేకూర్చేవిగా ఉంటాయి. కాని, ఎప్పుడైతే నిరుపయోగమైన ఆలోచనలు నిరంతరాయముగా వెలువడుతున్నాయో - శక్తివంతమైన ఆలోచన కూడా శక్తిని కోల్పోతుంది. అది ఎలాగంటే, ఒక వ్యక్తి ఒక బరువును ఒక దిశగా జరుపుతుంటే, పది మంది వ్యక్తులు ఆ బరువును వ్యతిరేక దిశలో జరపడానికి ప్రయత్నిస్తున్నట్లన్నమాట! పూజ చేయడమనేది ఆలోచనల పరంపరకు (తాత్కాలికముగానైనా) అడ్డుకట్టవేయడం. అయితే ఈ రోజులలో చాల మంది పూజ పేరుతో దేవుని "ఇది కావాలి. అది కావాలి. ఇది ఇస్తే నేను నీకు అది సమర్పించుకుంటాను." అని వ్యాపార భాగస్వామిని చెయ్యాలని ప్రయత్నం చేయడం మనకు తెలిసిన సత్యమే. పూజ చేస్తున్నప్పుడు త్రికరణశుద్ధితో చేయాలి. అప్పుడే దానివలన ప్రయోజనము. అలాగే మంత్రజపము కూడా త్రికరణశుద్ధితో చేస్తేనే ప్రయోజనము. పూజ చేయడం వలనగాని, జపమువలనగాని ధ్యానమును అలవరచుకోగలిగితే- అపుడు అసంకల్పితముగా కోపము, అసూయ, ద్వేషము వంటివి మనలో కలుగవు.

ఆత్మశుద్ధిలేని ఆచారమదియేల? భాండశుద్ధిలేని పాకమేల? చిత్తశుద్ధిలేని శివపూజలేలరా? అన్న వేమన పలుకులు అతి విలువైనవి. చిత్తశుద్ధిని అలవరచుకొనే శక్తిని ప్రసాదించమని ఆ పరమేశ్వరునే ప్రార్థన చేద్దాం!